# సమర్పణ ప్రార్థనలు

**(స్తుతులు, సమర్పణ, ప్రార్థనలు)**

"పరిశుద్ధమును, దేవునికి అనుకూలమునైన
సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు
సమర్పించుకొనుడి" రోమా 12:1


-: గ్రంథకర్త :-

**ఫాదర్. యం. దేవదాసు అయ్యగారు**



కాకినాడ,
డిసెంబరు 2007

**వెల: రూ. 15/-లు**


## సమర్పణ కీర్తన

*రా : యదుకుల కాంభోజి* *తా : ఆది*

**ప : తనువు నాదిదిగో గై - కొనుమీ యో ప్రభువా నీ - పనికి**
**ప్రతిష్ఠింపు మీ = దినములు క్షణములు - దీసికొని యవి నీదు**
**వినుతిన్ ప్రవహింప జే - యను శక్తి నీయుమీ ॥తనువు॥**

1. ఘనమైన నీ ప్రేమ - కారణంబున నీకై - పని చేయ జేతులివిగో
= అనయంబు నీ విషయ - మై సొగసుగా చురుకు - దనముతో
బరుగెత్త - వినయ పాదము లివిగో ॥తనువు॥

2. స్వరమిదిగో కొనుమీ - వర రాజా నిను గూర్చి - నిరతమ్ము పాడ
నిమ్ము = మరియు పెదవు లివిగో - మహనీయమైన నీ - పరిశుద్ధ
వార్తతో - పరి పూర్ణముగ నింపు ॥తనువు॥

3. వెండి పసిడి యివిగో - వీసమైనను నాకై - యుండవలెనని కోరను
= నిండైన నీ యిష్ట - నియమంబు చొప్పున - మెండుగ వాడ బరి
మితియౌ జ్ఞానంబిదిగో ॥తనువు॥

4. నా యిష్టమిదిగో యిది - నీ యిష్టముగ జేయ - నా యిష్ట మిక
కాదది = నా యిచ్ఛ యున్నట్టి - నా హృదయ మిదిగో నీ - కే
యిది యె రాజా - కీయ సింహాసనమౌ ॥తనువు॥

5. ఉన్న నా ప్రేమ నీ - సన్నిధానమున నే - నెన్నడు ధారబోయన్
= నన్ను నీ వానిగా - నాథా గైకొను మపుడు - చెన్నుగ నీ
వశమై - స్థిరముగ నుండెద ॥తనువు॥

# సమర్పణ ప్రార్ధన

(స్తుతులు, సమర్పణ, ప్రార్ధనలు)

## 1. స్తుతులు

దేవా, తండ్రీ నా నిమిత్తమై సమస్తమును కలుగజేసిన తండ్రీ అనుదినము మాకు కావలసినవన్నియు అందించుచున్న తండ్రీ నేను అందుకొనలేని బిడ్డనైనను మానకుండ అందించుచున్న తండ్రీ నన్ను కలుగజేసిన తండ్రీ నా ప్రియుడవైన తండ్రీ నా దేవా, నా ప్రభువా, నా పోషకుడా, నా రక్షకుడా, నా సర్వమా నీకనేక నమస్కారములు. తండ్రీ సృష్టిమూలముగా మాత్రమే గాక, నీ కుమారుని మూలముగా కూడ నన్ను నీ బిడ్డగా ఏర్పరచుకొన్నందు లకై నీకనేక వందనములు.

నీ దానముల మూలముగాను, నీ సహింపు మూలముగాను నీ నడిపింపు మూలముగాను, మా కష్టములు నివారణచేయు నీ క్రియల మూలముగాను, నీవు మాకుచేయు ఉపకారముల మూలముగాను, నాకు నీవు చూపుచున్న ప్రేమను తలంచుకొని నిన్ను స్తుతించుచున్నాను గాని నా స్తుతి నీ ప్రేమ యెదుట యేమాత్రము, నా అంతరంగమందున్న కృతజ్ఞత నీ అనంత ప్రేమయెదుట యేమాత్రము. నేను ఏ పనియు ముట్టుకొనక స్తుతిమాత్రమే చేసినను అది సహితము నీకనికరము యెదుట మిక్కిలి స్వల్పమైయుండును. ఆ స్వల్ప స్తుతులను కూడ నీవు హస్తార్పణముగ అందుకొనుచున్నావు గనుక నీకు వందనములు. నీవు నన్ను నేటివరకు కాపాడుచు, నడిపించుచు వృద్ధిలోనికి తీసుకొని వచ్చుచున్న నీ శక్తిని తలంచుకొని స్తుతించుచు ఇక ముందునకు కూడా నా విషయములో యిట్టి కార్యములు చేయుచుందువని నమ్ముచు నిన్ను స్తుతించుచున్నాను. నా జీవితాంతమందు నిశ్చయముగ నన్ను పరలోకమునకు చేర్చుకొందువని నిరీక్షించుచున్నాను. నీకనేక వందనములు.

(2) 1) అనాదిదేవా, అనంతదేవా, ఉన్నదేవా, సృష్టింపబడకుండనున్న దేవా, ఈ నీ గొప్పతనమునకు అనేక స్తోత్రములు.



2) అనంతదేవా నీవు యెల్లప్పుడుండగల దేవుడవు. గనుక నీకు నిత్యస్తోత్రములు. నీవు యెల్లప్పుడుండువాడవు గనుక నీకు అనంత స్తోత్రములు.

3) జీవమైయున్న దేవా, నాలోని జీవమును నా బలహీనతను బట్టి నిర్జీవ స్థితిలోనికి వచ్చుచున్నప్పుడు మరల నాలో నూతన జీవము ధారపోయుదువు గనుక నీకు నిత్యజీవ స్తోత్రములు.

4) శక్తిమంతుడవగు దేవా, నా విషయములో యెంత గొప్ప కష్టమైన పనియైనను, అసాధ్యమైన పనియైనను, చేయగలవు గనుక నీకు నా శక్తికొలది వందనములు.

5) జ్ఞానివైయున్న దేవా నీవు జ్ఞానివి గనుక, నా కష్టములు నా కోరికలు నేను నీకు చెప్పుకొనకముందే నీకు తెలిసేయున్నవి. అందుచేతనే నీవు నా కోర్కెను తీర్చగలవు నా కోర్కెలు నెరవేర్చుటకు యెన్నో చిక్కులు అడ్డముగ నున్నను ఆ చిక్కులన్నియు విడదీసి నా కోర్కె నెరవేర్చగల జ్ఞానోపాయము నీకు గలదు. గనుక నీకు నాకు తెలిసినన్ని వందనములు నా జ్ఞానమునకు తోచినన్ని వందనములు చేయుచున్నాను.

6) పరిశుద్ధుడవైన దేవా, నీవు నన్నును, సమస్తమును కలుగజేసినప్పుడు పరిశుద్ధమయముగనే కలుగజేసినావు గాని పాపప్రవేశమును బట్టి నాకు అపరిశుద్ధత కలిగెను. అయినను నీ పరిశుద్ధతను బట్టి నాకు మరల పరిశు ద్ధత దయచేయగలవు గనుక నిష్కళంకమైన పరిశుద్ధ మనస్సుతో నీకు స్తుతి చేయుచున్నాను.

7) ప్రేమారూపివైన తండ్రీ భూలోకమందలి తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రేమించుటకన్న నన్ను నీవు యెంతో యెక్కువగా ప్రేమించుచున్నావు కాబట్టి నీకు నా వందనములు.

8) న్యాయస్వరూపివైన దేవా, నేను పొరబాటులోనున్నప్పుడు న్యాయమైన

రీతిగా నన్ను గద్దించి ప్రేమతో శిక్షించు దేవుడవు గనుక నీకు వందనములు ఆచరించుట న్యాయమైయున్నది. గనుక నీకు వందనములు ఆచరించుచున్నాను.

9) నిరాకారుడవైన దేవా, నా బలహీనతను బట్టి నేను నిన్ను చూడలేక పోయినను నీవు నన్ను చూచుచున్నావు. నీవు నిరాకారుడవు అయినప్పటికిని నాకు ఉపయోగమైన శరీరాకారమును దయచేసినావు మరియు నా ఆత్మకు నిరాకారము అనుగ్రహించినావు కాబట్టి నా శరీరముతోను, నా ఆత్మతోను నిన్ను స్తుతించుచున్నాను.

10) సర్వవ్యాపివైయున్న తండ్రీ, నీవు పరలోకమందును, భూలోక మందును, అన్ని స్థలములలో నుండగల వాడవు గనుక నీకు స్తోత్రములు. నేను యెక్కడున్నను నీవు అక్కడుందువు ఉండగలవు. నీవు నాకు జతగా నుండగలవు. ఉండి సహాయము చేయగలవు. నేను ఒంటరిగానున్నాను అను చింతలేకుండ చేయగలవు గనుక నీకు వందనములు. అన్ని స్థలములలో నీకు వందనములు.

11) స్వతంత్రుడవైన ప్రభువా, సమస్తకార్యములు నీయంతట నీవు చేయగల తండ్రీ నీకు స్తోత్రములు. నేనుకూడ స్వతంత్రముగా పనిచేయగల శక్తి అనుగ్రహింపగలవు నీ మీద మాత్రమే ఆధారపడి నాలోని స్వతంత్రతను బట్టి నా కార్యములు చేసికొనగల స్థితి అనుగ్రహించినావు గనుక నీకు స్తోత్రములు. స్వేచ్ఛాపూర్వకమైన స్తోత్రములు బలవంతముగా కాక కేవలము స్వతంత్రముగా నిన్ను స్తుతింపగోరుచున్నాను. నీ గుణములన్నియు నాకు కూడా అనుగ్రహించుట వలన నీ లక్షణ రూపము నీ కోరిక నాకు అనుగ్రహించినావు అన్నియు అనుగ్రహించి ఒక్క స్వతంత్ర లక్షణముగాని అనుగ్రహింపకున్న యెడల తక్కినవన్ని యిచ్చిన ప్రయోజనము లేదు గనుక స్వాతంత్ర్యలక్షణము యిచ్చినందుకు నీకు స్తోత్రములు.

12) తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలను పేరులతో బైలుపడిన త్రియేక దేవుడవైన తండ్రీ నీ ప్రత్యక్షత విషయమై నీకనేక వందనములు. నీవు



నాకు దాగియుండు దేవుడవు కావు. గాని బైలుపడు దేవుడవు నీ లక్షణములు, నీ క్రియలు, నీ గొప్పతనము నాకు బైలుపర్చు దేవుడవు గనుక నీకు వందనములు. నీవు ఒక్కడవుగాను, ముగ్గురుగాను బైలుపడినావు. నీ మర్మము మాకు తెలియదు గాని నమ్ముచున్నాను. నేను నీ యొద్దకు పరలోకమునకు జేరినప్పుడు తెలిసికొనగలను. నీ అపరిమిత జ్ఞానస్థితిని ఎట్లు తెలిసికొన గలను? అనంతకాలము నీ విషయములు క్రొత్తక్రొత్తగా తెలిసికొనుచునే ఉందును.

నీ ప్రత్యక్షతకును నేను తెలిసికొనుటకు అంతములేదు. గనుక నీకు అంతములేని స్తుతులు చెల్లించుచున్నాను.

13) మహిమ స్వరూపీ, ఆనంద స్వరూపీ నేను నిత్యము నీ మహిమ కొరకు నీ ముఖ దర్శనములో, నీ సన్నిధిలో, నీ సహవాసములో మిగుల ఆనందముగ గడుపగల స్థితి దయచేయుదువని నమ్ముచు నీకనేక వందనములు చేయుచున్నాను.

14) మాకు శరీరమును అనుగ్రహించిన దేవా! నీకు వందనములు. ఈ శరీరము పాపశరీరమైనందున దీనిని పరిశుద్ధ శరీరముగా మార్చు చున్నావు. తుదకు నాకు మహిమ శరీరము యిచ్చి నీ యొద్దకు తీసికొని వెళ్ళుదువు గనుక నీకు వందనములు. నీవు మూడు విధములుగా బయలుపడినావు. అట్లే నాకు మూడు విధములైన స్థితులు అనుగ్రహించినావు. జీవము, శరీరము, ఆత్మ అను మూడు స్థితులు దయచేసినందుకు నీకు వందనములు. ఈ మూడు కలిపి నన్ను ఒక వ్యక్తిగా నిలిపినావు గనుక నీకు స్తోత్రములు. నేను ఒక విధముగ నీకు బిడ్డవలెనున్నాను మరియొక లెక్కకు మూడుగానున్నాను. ఈ విచిత్రమైన సృష్టి నిమిత్తము నీకు వందనములు. తండ్రీ నీవు నాకు యిచ్చినవన్నియు నేను నిలుపుకొనునట్లు నాకు తోడ్పడుదువని నమ్మి వందించుచున్నాను.

3. తండ్రీ! నీ స్థితిని, నీ క్రియలను, నీ దివ్యగుణములను, నా యెడలయున్న

నీ తీరును, నీ మహిమను ఎవరు వర్ణింపగలరు? నీకనేక వందనములు.

4. దానకర్తవైన తండ్రీ! నీ ఉచిత దానముల నిమిత్తమై నీకు స్తోత్రములు. గాలి ఉచితము నేను పన్ను కట్టలేదు ఒకవేళ నేను కట్టినను అది చాలదు. నీ ఉచిత ధర్మము నిమిత్తమై అవి యున్నంతకాలము నీకు స్తోత్రములు. లోకాన్ని కలుగజేసినది మొదలుకొని లోకాంతము వరకు నీవు నరులందరకు, అవిశ్వాసులకు, విశ్వాసులకు, మృగములకు, వృక్షాదులకు జీవరాసులకు ఉచితముగా ధర్మముచేయుచునే యున్నావు. ఇవన్నియు మేము సంపాదించు కొనవలెననియున్న యెడల రవ్వంతయైనను సంపాదించుకొనలేము. ఎన్నో పండ్లు, ఎన్నో కూరగాయలు యిచ్చుచున్నావు. మానవులు తినగా ఎన్నో మిగిలి పోవుచున్నవి. నీకనేక స్తోత్రములు. నీళ్ళు కూడ మిగిలిపోవుచున్నవి. నీవు భూమిలో పెట్టిన ఖనిజములు, లోహములనేకములున్నవి. మానవులు యింకా వీటిని తీసికొని వాడుకొనలేదు. కొన్ని వాడుకొనుచున్నారు. గాలి తరగడము లేదు. నీవు మా యెదుట వేసిన భోజనపు బల్లమీద నున్న పదార్థములు యింకా యింకా తరగడము లేదు. ఒకదరి నుండి మేము వాడుకొనుచుండగా నీవు ఒకదరినుండి యింకను క్రొత్తవి యిచ్చుచునే యున్నావు. నీ దాన స్వభావమును ఎవరు వర్ణింపగలరు? మా తెలివితక్కువ వల్ల మేము వాటిని పూర్తిగా వాడలేకపోవుచున్నాము. నీ దానములు అందుకొను శక్తి నరుల కందరకున్న యెడల అందరును ధనికులే ఒక్కరైనను బీదవారుండరు. నీవు కలుగజేసిన వాటిలో ఉపయోగములేనిది యేదియులేదు నా విషయమై నీకు ప్రతిదినము ఎంతో ఖర్చున్నది. నీవు బిల్లు వేసినయెడల నేను యియ్యగలనా? ప్రతి నిమిష దానములను బట్టి నీకనేక వందనములు.

5. ఓ తండ్రీ! నీవిచ్చిన అన్నిదానములకంటే నీవు నీ కుమారుని పంపిన దానము గొప్పది. అనంతమైనది. ఎందుకు నిన్ను స్తుతింపవలెనని కోరిన యెడల ప్రతి రెప్పపాటున స్తుతింపవలెను. నీ కుమారుని అవతార దానము నకు మించిన దానము లేనేలేదు. ఆ దానమును బట్టి నీకు స్తోత్రములు.



నేను పాపవిసర్జన చేయవలెననియు, బాప్తిస్మము పొందవలె ననియు, రక్షణ అందుకొనవలెననియు, సంస్కారభోజనము భుజింపవలె ననియు ఇతరుల రక్షణార్ధమైన సేవ చేయవలెననియు, నీ వాక్య గ్రంథమును మా హృదయములో అచ్చువేయించుకొనవలెననియు, జీవాంతమందు నీ సన్నిధికి వచ్చివేయవలెననియు, నీవు కోరుచున్న కోరికకు యేమిచెప్పగలను. నీ దానములు లెక్కపెట్టుకు కూర్చున్నయెడల మా ద్వీ జీవితకాలము చాలదు. మా విశ్వాసము, మా గ్రహింపు మా స్తుతి నీ దృష్టి యెదుట మిగుల స్వల్పమైనను నీవు అంగీకరించుట ఆశ్చర్యముగా నున్నది. ఏమి చెప్పగలను. ఏమి వివరింపగలను. ఎంత జాగ్రత్తగా స్తుతిచేసినను యెప్పుడు పూర్తిగా కుదరదు. అయినను నీవు ఆనందించుచున్నావు. నీకు స్తోత్రము నీ కుమారుని దానమునకు వెలుపల ఏ దానమును లేవు నీవు చూపుచున్న కృప వెలుపల ఏ కృపయు లేదు. సంఘము యొక్క వెలుపల రక్షణ లేదు. నీ మహత్తు విషయమై నీకు లెక్కకు మించిన స్తోత్రములు.

6. నా జన్మము, నా బ్రతుకు యెంత పవిత్రముగానున్నను మరణ సమయమందు పరలోకమునకు నేను సిద్ధము కానియెడల మా ఆయుష్షు అంతయు వ్యర్థమే ఒకవేళ నేను మరణసమయమునందు అంతకన్న మించిన అంతస్థు గల మరియొక ధన్యకాలము కలదు. ఆ కాలమునకు ఆ రెప్పపాటు కాలమునకు మా ప్రభువు యొక్క రెండవ రాకడకు నేను సిద్ధపడనియెడల భూమిమీద శ్రమలు అనుభవించుటకు మిగిలిపోవుదును. నేను అంతకాలము భక్తిగా బ్రతికి, అన్నియు నమ్మి రెండవరాకడకు మిగిలిపోవుదును. నేను అంత కాలము భక్తిగా బ్రతికి, అన్నియు నమ్మి రెండవరాకడను నమ్మకయు నమ్మినను సిద్ధపడకయు నున్నయెడల నాకు ఎంత దౌర్భాగ్యత దాపరించును. భక్తిగల జీవనము, భక్తిగల మరణము సజీవుల గుంపులో చేరవలసిన ఆరోహణము, మా యెదుట పెట్టియున్నావు గనుక నీకు స్తోత్రములు లేనియెడల మా బ్రతుకు వలన ప్రయోజనమేమి? ఇట్టి ప్రయోజనము లేని స్థితి నాకు రాకుండ చేయగల తండ్రి నీకు స్తోత్రము.

## 2. సమర్పణ

1. అతిపరిశుద్ధుడవైన తండ్రీ! నీవు నరజాతి తల్లిదండ్రులను పరిశుద్ధవంతులనుగా చేసినప్పటికిని వారు పాపములో పడిపోవుట వలన వారిని బట్టి మాకందరికి పాపము ప్రవేశించినది. ఓ తండ్రీ పాపమును విసర్జించుటకు మాలో శక్తిని అమర్చినావు. గాన పాపము లేకుండ ఉండలేకపోవుచున్నాను. ప్రయత్నించు చున్నాను, పడిపోవుచున్నాను. మరల నీ యెదుట ఒప్పుకొనుచున్నాను. సూర్యచంద్ర నక్షత్రముల కాంతి నీ పరిశుద్ధత యెదుట లోపము కలిగియున్నవి. మరియు పరిశుద్ధులైన దేవదూతల పరిశుద్ధత యెదుట తక్కువైయున్నది. పాపులమైన మేము ఎట్లు నిర్దోషులమైయుండగలము? నీవు క్షమించబట్టిగాని నేను యిదివరకే నశించియుండవలసినదే నా ప్రభువా, నా తలంపులోనికి, నా మాటలోనికి, నా ప్రయత్నములోనికి నాక్రియలోనికి పాపము ప్రవేశించినప్పుడెల్ల విసర్జింప పూనుకొనియున్నాను. నీవు సహాయము చేయుదువు. చెడుగు కనబడినప్పుడు ఓ సైతానా, ఇది నీ పని, నామీద నీకు ఏ అధికారములేదు వెళ్ళిపో! అని ఎదిరించుటకు పూనుకొన్నాను. నా పాపములు ఎప్పటికప్పుడే నీయెదుట ఒప్పుకొని శుభ్రపడుటకు పూనుకొన్నాను.

2. దేవా పాపము ఒక్కటే కాదు పాపము ప్రవేశించి ఊరుకొనలేదు అది వ్యాధిని కలిగించుచున్నది. అట్టి సమయములో నిన్ను వేడుకొని స్వస్థత పొందుటకు పూనుకొన్నాను. ఏ తప్పిదము వలన వ్యాధి చేరినదో తెలసికొని క్షమాపణకోరి స్వస్థత పొందుటకు పూనుకొన్నాను. ఒకవేళ వెంటనే స్వస్థత కలుగకపోయిన యెడల ప్రార్థించి నీ దీవెనతో ఔషధము వేసికొందును. నీళ్ళను ఔషదముగా నీవు నయమాను విషయములో వాడినావుకదా! నరుడు పాపములో పడిపోవుననియు అందువలన జబ్బు తెచ్చుకొనుననియు నీకు ముందుగా తెలిసి మూలికాదులు పుట్టించి అవి ఔషధములుగా వాడుకొను జ్ఞానమును  కొందరికి యిచ్చి ఔషధములు చేయించుచు అనేకమందిని బాగుచేయుచున్నావు. ఇది నీ అద్భుతమైన కృప అయినను మందు లేకుండ



ప్రార్థన, విశ్వాస స్తోత్రముల వలనను స్వస్థత పొందవలెనని నీ నామధారుల విషయములో కోరుచున్నాను.

3. తండ్రీ పాపము వలననే యిబ్బంది. పేదరికము, అప్పుల పాలగుట సంభవించుచున్నది. ఇట్టిది నాకు కలిగిన యెడల విశ్వాస మూలముగానే తొలగించుకొనుటకు  పూనుకొన్నాను.

4. ఈ అవస్థలు కాక ఇంకను అనేకమైన అవస్థలు కలుగుచున్నవి. అట్టి సమయములలో ప్రార్థన వలననే తొలగించుకొనుటకు పూనుకొనియున్నాను.

5. పాపమునుబట్టి మరియొక పాపము, అవిశ్వాసము, అధైర్యము, దిగులు, అనిశ్చయత, విసుగుదల, నీ నడిపింపును అపార్థము చేసికొనుట, నీ నిశ్శబ్దమును గ్రహింపలేకపోవుట, సైతానుకు, శత్రువులకు, గాలి తుఫానుకు, ఎండకు, వానకు, పిడుగులకు, చెడ్డకలలకు, తప్పుడు దర్శనములకు, యుద్ధములకు, కరువులకు, వ్యాపించు వ్యాధులకు, విషపురుగులకు, మరణమునకు, నరకమునకు భయపడక నిన్నుబట్టి భయములను నివారణ చేసికొనుటకు  పూనుకొన్నాను.

6. పాపపరిహారము, వ్యాధి నివారణ, యిబ్బంది నివారణ యింకను కావలసినవన్నియు, మోక్షభాగ్యము దయచేయుదువనియు, నీ వాక్యములో వ్రాయించిన వాగ్దానములన్నియు నమ్ముటకై పూనుకొన్నాను. ముఖ్యముగా యోహాను 12:14లో నున్న వాగ్దానము, ఎఫెసీ 3:21లో నున్న వాగ్దానము, మార్కు 11:24లో నున్న సలహాను నమ్ముటకు పూనుకొన్నాను.

7. పరిశుద్ధాత్మ దేవా, నేను పరిశుద్ధుడనైయున్నట్లు నీవును పరిశుద్ధుడవైయుండుమని సెలవిచ్చిన దేవా నీకనేక స్తోత్రములు. ప్రతి పాపము నుండి నన్ను దూరపర్చుము శోధనలోనికి నన్ను రానీయకుము. నాకు తెలిసిన ప్రతి పాపమునుండి తప్పించుకొనుటకు పూనుకొన్నాను. నిన్ను మరచియుండుట, నీ మీద విసుగు కొనుట, నీయెడల కృతజ్ఞత లేకుండుట, ఆరాధనకు వెళ్ళుటలో నిర్లక్ష్యము కలిగియుండుట, పెద్దల యెడల అమర్యాదగా

నడుచుట, కొట్టుట స్త్రీ, పురుషుల యెడల దుర్వాంఛ కలిగియుండుట, ఒకరిది ఆశించుట, అపహరించినది తిరిగా యివ్వకుండుట, ఉన్నవి కొన్ని, లేనివి కొన్ని ఒకరిని గురించి యితరులకు చెప్పి అల్లరిచేసి పేరు చెడగొట్టుట, అబద్ధములాడుట, కల్పనలు చేయుట, తప్పుపక్షముగా వాదించుట అసూయపడుట, తగనిరీతిగా కోపపడుట, ఒకరిని ద్వేషించుట, తిట్టుట, కుట్రాలోచనలు చేయుట ఊరుపేరులేని వ్రాతలు వ్రాయుట, ఇతరుల పాపములో పాలివారగుట, ఇట్టి పాపములు చేయకుండుటకు పూనుకొన్నాను.

8. కష్టకాలము వచ్చినప్పుడు అదికూడ మేలుకొరకేనని అనుకొనుటకు పూనుకొన్నాను. యథాప్రకారమైన వాడుకలు చేయుటకును మేలు చేయుట మానకుండుటకును పూనుకొన్నాను. రోజులోని ప్రతి సమయమందు నీతలంపు కలిగియుండుటకును పూనుకొన్నాను. లేచుటతోనే నిన్ను స్తుతించుటకు నీ గ్రంథములోని సంగతులు నేర్చుకొనుటకు నా కొరకు అందరికొరకు ప్రార్థించుటకు, నీ కీర్తనలు పాడుట ఇతరులకు నిన్ను గురించి సాక్ష్యమిచ్చుట, దేవాలయమునకు వెళ్ళుట, మంచి మంచి పత్రికలు చదువుట, పుస్తకములు చదువుట బీదలకు ధర్మముచేయుట, జీవరాసుల యెడల దయగానుండుట, ప్రతి అవసరమైన పనుల సమయములలో వెంటనే ప్రార్థన చేయుట, భోజన సమయమందు, నీళ్ళు త్రాగు సమయమందు, ఎక్కడికైనా వెళ్ళుసమయ మందు, నీళ్ళు త్రాగు సమయమందు, ఎక్కడికైనా వెళ్ళు సమయమందు, ప్రార్థించుట, కుటుంబ ప్రార్థన చేసికొనుట, రాత్రులందు మెలుకువ వచ్చినప్పుడు ప్రార్థించుకొనుట ఈ మొదలగు వాడుకలు మానకుండ జరుపుకొనుటకు పూనుకొన్నాను, మరియు నా పోషణార్థమై నేను చేయవలసిన పనులలో, ఉద్యోగములో నమ్మకముగా ఉండుటకు పూనుకొన్నాను.

9. 1) దేవా నీ చిత్తమే నా చిత్తము నాచిత్తము నీచిత్తమునకు వ్యతిరేకముగా నున్నప్పుడు నా చిత్తమును కొట్టివేసికొందును.

2) దేవా, నన్ను ఒకచోటికి వెళ్ళుమని నీవు నాతో చెప్పినపుడు నా



మనసులో యిష్టము లేకపోయినను నాకు శక్తి, వీలులేకపోయినను ఏమియు మాటలాడకుండ అబ్రహాయువలె వెళ్ళుటకు పూనుకొన్నాను.

3) దేవా, ఒక కష్టమైన పని నీవునాకు అప్పగించి తప్పకుండ చేయుమని చెప్పినయెడల నాకు దిగులు పుట్టినప్పటికిని, యిష్టము లేనప్పటికిని పనిచేయుటకై పూనుకొన్నాను.

4) దేవా, నాకు యిష్టములేని మనిషితో నీవు చెప్పే మాటలు అతనికి చెప్పుటకు వెళ్ళుమని నీవు ఆజ్ఞ యిచ్చిన యెడల నాలో పిరికితనము పాతుకొని యున్నప్పటికిని అతనితో మాట్లాడుటకు పూనుకొన్నాను.

5) దేవా, మరియొక మనిషియొద్దకు వెళ్ళి నిన్ను గురించి సాక్ష్యమిమ్మని నీవు నాతో చెప్పినయెడల ఏమి చెప్పవలెనో నాకు తెలియనప్పటికిని నేను వెళ్ళుటకు పూనుకొన్నాను.

6) దేవా, అడవి మృగములున్న వనముదాటి అవతలనున్న గ్రామము మధ్యను నిలిచి బోధించుము అని చెప్పిన యెడల నిర్భయముగా వెళ్ళుటకు పూనుకొన్నాను.

7) దేవా, అస్సాము దగ్గరనున్న నాగారుకొండలలో నివసించుచున్న నరమాంస భక్షకుల యొద్దకు వెళ్ళి బోధించుమని నీవు చెప్పిన యెడల ప్రశ్న వేయకుండ వెళ్ళి అట్లు చేయుటకు పూనుకొన్నాను (బలమిస్తే వెళ్ళుదును అని అనను)

8) దేవా, భాష ఎరుగని దేశమునకు నిన్ను పంపుదును అని నీవు నాతో అన్నట్లయతే ఏమియు తిరుగుచెప్పక వెళ్ళి ప్రసంగించుటకు పూనుకొన్నాను.

9) దేవా, ఒకదేశమునకు నీవు సువార్త పనిమీద వెళ్ళుము, అక్కడ వారు నిన్ను బళ్ళెములతో పొడిచి చంపివేయుదురు అని నీవు చెప్పిన యెడల, నేను ముస్తాబై వెళ్ళుటకు పూనుకొన్నాను (హతసాక్షుల కిరీటము వచ్చును)

10) దేవా, వెళ్ళి ఆ కొండమీద 40 దినములు ఉపవాసము చేయుము అని నీవు నాతో చెప్పినప్పుడు అంతకన్నా భాగ్యమున్నదా అని చేయుటకు

పూనుకొన్నాను.

11) దేవా! నాకు ప్రియమైన ఒకరు చనిపోవుటకు సిద్ధముగా నున్నప్పుడు బ్రతికించే ప్రార్థనలు ఎందరు చేసినను నీవు విన్నప్పుడు నేను ఆనందించి స్తుతించుటకు పూనుకొన్నాను.

12) దేవా! నా చేతిలో ఒక పైసాయైనను లేనప్పుడు నీవు నన్ను చూచి రేపు పేదలకు సంతర్పణ చాటించుమని నీవు చెప్పిన యెడల అట్లు చేయుటకు పూనుకొందును.

13) దేవా, అసాధ్యమైన ఏపని నీవు నాకు చెప్పినను నేను చేయనని అనకుండుటకు పూనుకొన్నాను.

14. (1) దేవా యేసుక్రీస్తునందు పురుషుడనియు, స్త్రీ అనియు బేధము లేదని నీ వాక్యములో వ్రాయబడియున్నది. గనుక నాకొక పరిచయ శక్తి దయచేయుము. అదేదనగా నాకంటే చిన్నవారైన బాలికలను చెల్లెంద్రుగాను, పెద్దవారైన బాలికలను అక్కలనుగాను, చిన్నవారైన బాలురను తమ్ములను గాను, పెద్దబాలురను అన్నలుగాను, పెద్ద స్త్రీలను తల్లులుగాను, పెద్ద పురుషులను తంద్రులుగాను భావించుకొనుటకు పూనుకొన్నాను. అధికారు లను, పెద్దలను, గురువులను చూచినప్పుడు గౌరవభావము కలిగించు కొనుటకు పూనుకొన్నాను.

2) నా తండ్రీ ఎవరైనా నా తలంపులోనికి వచ్చినప్పుడు కంటికి కనబడు నప్పుడు వారిని దీవించుము అని నా మనస్సులో ఈ చిన్న ఏకపద ప్రార్థన చేయుటకు పూనుకొన్నాను.

3) దేవా, కష్టస్థితిలో నున్నవారు, జ్ఞాపకము వచ్చినప్పుడును, కనబడి నప్పుడును నా మనస్సున జాలిపడుటకు పూనుకొన్నాను.

4) దేవా, ఎప్పుడైన ఒకసారి భూగోళము యొక్క పటము చూచి ప్రతి దేశమును గురించియు, ప్రతి లంకను గురించియు ప్రార్థించుటకు పూనుకొన్నాను.



5) ఓ దేవా, ఏక దైవారాధనచేయు మతస్థులను గురించియు యూదా మతస్థులను గురించియు, బౌద్ధ మతస్థులను గురించియు, జైన మతస్థులను గురించియు, పారశీక మతస్థులను గురించియు, నాస్తిక మతస్థులను గురించియు అప్పుడప్పుడు ప్రార్థించుటకు పూనుకొన్నాను.

6) దేవా జీవరాసులను గురించియు, వృక్షాదులనుగురించియు శాపము పొందిన భూమిని గురించియు, ఆకాశమందున్న వాటిని గురించియు అప్పుడప్పుడు ప్రార్థించుటకు పూనుకొన్నాను.

7) దేవా, మానవులకు హాని చేయు క్రియలను గురించియు, ఇతర జీవరాసులను గురించియు ప్రార్థించుటకు పూనుకొన్నాను.

8) దేవా, నీవు కలుగజేసిన సమస్తమును దీవించుమని ప్రార్థించుటకు పూనుకొన్నాను.

9) నేను మరచిపోయి ప్రార్థింపని అంశమును గురించి నీ సన్నిధిలో పెట్టుటకు పూనుకొన్నాను.

10) దేవా, మానవుల ఉపయోగార్థమై నరులు కల్పించిన వాటిని అనగా పాఠశాలలను, వైద్యశాలలను, చేతిపనుల శాలలను, అన్ని వృత్తులను అన్ని ఉపయోగకరమైన వస్తువులను గురించియు ప్రార్థించుటకు పూనుకొన్నాను.

**15. దేవా కొన్ని మనవులు చేయుచున్నాను**

1) "క్రైస్తవ సంఘమా – ఘనకార్యములు చేయు – కాలము వచ్చును" అను కీర్తనలోని సంగతులు త్వరగా నెరవేర్చుదువని నమ్ముచున్నాను.

2) "పరమదేవుండే – నా పక్షమైయుండగ" అను కీర్తనలోని సంగతి నెరవేర్చుదువని నమ్ముచున్నాను.

3) "మనోవిచారము" అను కీర్తనలోని సంగతులు త్వరగా నెరవేర్చు దువని నమ్ముచున్నాను.

4) "యేసు నామస్మరణ" అను కీర్తన యింకా యెక్కువగా దీవించుదువని నమ్ముచున్నాను.

## 3. ప్రార్థనలు

ఇవి బైబిలు మిషనువారు అభిమానులు చేయదగిన ప్రార్ధనలు.

1. తండ్రీ బైబిలుమిషనును నీవే బయలుపరచియున్నావను సంగతి లోకమంతటికిని నీవే స్వయముగా కనబడి చెప్పుము. అనేకులు నమ్మరు అయినను చెప్పుమని వేడుకొనుచున్నాము.

2. దేవా, బైబిలుమిషనును నీవు స్థాపించినావను సంగతి మేము కూడా ప్రకటింతుము మా ప్రకటనలు దీవించుము. మాలో మెంబర్లుగా నుండియు, మా అభిప్రాయములకు దూరస్థులైయున్నవారి అపరాధములను వారికి స్వప్నములో తెలియపర్చి దిద్దుకొనుటకు వారికి శక్తి దయచేయుము.

3. దేవా, మేము తప్పు సిద్ధాంతములను చెప్పకుండ ఆపుచేయుము.

5. దేవా, మేము వేసే పత్రికలు, పుస్తకములు మిషను ద్వారా వ్యాపింప చేయుము.

6. దేవా, మా మీటింగుల ద్వారా, స్వస్థతకూటముల ద్వారా, పద్యముల ద్వారా, ఆరాధన క్రమముల ద్వారా నీ విషయములు అందరికి తెలుపుము.

7. దేవా, బైబిలుమిషను ద్వారా ఆలోచించుచున్న ఆలోచన అన్నియు నెరవేర్చుము.

8. దేవా, నీకు యిష్టమైనవారిని మాత్రమే నీ బైబిలు మిషనులోనికి తీసుకొని రమ్ము.

9. దేవా, అయోగ్యులమైన మమ్మును బైబిలు మిషనులోనికి పిలిచినందుకు నీకు ప్రత్యేకమైన వందనములు.

10. దేవా ఏ ప్రత్యేకమైన ఉద్దేశ్యముతో నీవు బైబిలు మిషనును బయలు పరచినావో దానిని త్వరలో నెరవేర్చుము.

11. దేవా, మా బోధలకంటె, మా ప్రవర్తన వెల్లడిలోనికి వచ్చునట్లు తోడ్పడుము.

12. దేవా, ప్రస్తుతము మా మిషనులోనున్న అక్రమములన్నిటిని



పరిహరించుము.

13. దేవా, మా అందరి బలహీనతలను తొలగించుము.

14. దేవా, మాకు–పాఠశాలలు, వైద్యశాలలు, అనాధశాలలు, చేతిపనుల శాలలు, ముద్రాక్షరశాలలు, పుస్తకశాలలు, గొప్ప దేవాలయములు, గొప్ప గ్రంథాలయములు, గొప్ప రాబడులు, జీతనాతములు, పొలములు, సమాధి దొడ్లు, క్రైస్తవ విదేశీ సహాయములు, మిషను స్థానములు మాకు లేవని యితర మిషనులవారు హేళన చేయుచున్నారు. వారి తట్టు చూడుమని వేడుకొనుచున్నాము.

15. దేవా, మా సిద్ధాంతములు విని, అనేకులు నవ్వుచున్నారు వారివైపు కూడా చూడుము.

16. దేవా, మా మిషనులోని పిల్లలను విద్యార్థులనుగాను, ఉద్యోగస్తులను గాను చేయుము.

17. దేవా, మా మిషనులో నున్నవారందరికి దర్శనవరము దయచేయుము.

18. మేము దేవునిమీద ఆధారపడి యున్నామని చెప్పుచు మనుష్యుల మీదను, ఔషధములమీదను, చందాలమీదను ఆధారపడుచున్నారని యితరులు మమ్మును హాస్యము చేయుచున్నారు. దీనికి మేము చోటియ్య కుండునట్లు కృపదయచేయుము, మేము వారికి ఒక జవాబు యిస్తున్నాము. ఏలియా కాకులమీద ఆధారపడలేదు. మోషే తల్లి ఫరో కుమార్తె మీద ఆధారపడలేదు. ఈ ఏర్పాట్లు చేసిన నీ మీద ఆధారపడినామని జవాబు చెప్పుచున్నాను.

19. దేవా, బైబిలుమిషను నీవే బయలుపర్చావనేది ఒక్కటి మాత్రమే గొప్ప విషయమనియు, తక్కిన మా విషయములలో యితర మిషనులోనున్న బలహీనతలు మాకు కూడా యున్నవనియు మేము చెప్పుచున్నాము ఈ మాట దీవించుము.

20. దేవా, ఓహో! ఇది కేవలము దేవుడు బైలుపరచిన మిషను అని

సంతోషింతురు. అలాగే మమ్మును చూచికూడా ఓహో! వీరు దేవుని బైబిలు మిషనులో చేర్చుకొనబడిన వారు అని పలుకుచు సంతోషించునట్లు యితర మిషను విశ్వాసులును అభిమానులను ప్రేరేపింపుమని వేడుకొనుచున్నాము.

21. దేవా, మాలో యేవైన బహిరంగమగు తప్పులుగాని, రహస్యమైన తప్పులు గాని యున్నయెడల మమ్మును పిశాచికి గాని, శత్రువులకు గాని, సజ్జనులకు గాని అధికారులకు గాని, అప్పగింపక నీవే మమ్మును క్షమింపుము. దావీదు ఇట్లే కోరుకొనగా అతనికోరిక ప్రకారము చేసినావు కదా.

22. తండ్రీ ఈ ప్రార్ధనలో యింకా ఏమైన చేర్చవలసినవి ఉన్నయెడల నీవే చేర్చుము, తీసివేయవలసినవి నున్నయెడల నీవే స్వయముగా తీసివేయుము.

23. దేవా, నరుల జ్ఞాపకశక్తిలోనుండి మా పొరబాటును సమూలముగా పెరికివేయుము.

24. దేవా, మమ్మును రాకడకు సిద్ధపరచుము.

25. దేవా, రహస్యసన్యాసులను రాకడముందే పంపించుము మొదటి రాకడలో చేసినట్లు మృతులను లేపుము పక్షులతోను, మృగములతోను సువార్త చెప్పించుము. ఒక దినము లోకములోనున్న వారందరికి ఏకకాల స్వప్నములో నీవు కనబడి మాట్లాడుము.

ఈమా స్తుతులను, సమర్పణ, ప్రార్ధనలను నీ జనితైక కుమారుని ముఖముచూచి ఆలకింపుమని వేడుకొనుచున్నాము.

## ఆదివారమున చేయు స్తుతులు

1. దేవా, నీవు మొదటిదినమున వెలుగు కలుగజేసినావు కడపటి దినమగు ఏడవదినము సృష్టిపని ముగించినావు. ఏడవదినము శనివారము అని బైబిలు చరిత్రవలన తెలియుచున్నది. అలాగైతే మొదటి దినము వెలుగు కలుగును గాక అని నీవు చెప్పినరోజు ఆదివారమై యుండవలెను. లోకము యొక్క చరిత్రలోనికి మొదట వచ్చిన దినము ఆదివారము ఆ దినము వెలుగు



దినము కాబట్టి నీకుస్తోత్రములు.

2. వెలుగు దినమైన ఆదివారము క్రైస్తవులమైన మాకు ఆరాధన దినముగా వాడుకొననిచ్చినావు, గనుక మా ఆరాధన దినము వెలుగు దినము కాబట్టి నాకు వందనములు.

3. యేసుప్రభువు వచ్చి (పరలోకమునకు వెళ్ళేవరకు) ఏడవ దినమే అనగా సబ్బాతుదినమే విశ్రాంతి దినముగా ఆచరింపబడెను. గనుక నీకు స్తుతులు.

4. యేసుప్రభువా! నీ శిష్యులకు శనివారము దుఃఖదినము అది వారికి చీకటిదినము, వెలుగుదినము కాదు వారికి రక్షకుడవైన ప్రభువు మనలను ఎంతో ఉద్ధరిస్తారనుకొన్నాము గాని, శత్రువులు చంపిన చంపనిచ్చినాడు. ఇక మన గతియేమిటని నిరాశలో దిగిపోయినారు గనుక శనివారము మరింత దుఃఖదినము, అమావాస్య చీకటిదినము. అందరును చెదిరిపోయిన దినము. సంఘము కూడుకొనలేదు. యేసుప్రభువా! నీవు చావునెట్లు రానిచ్చినావో నీ శిష్యులకు దుఃఖదినమును కూడా రానిచ్చావు. ఇది వారిని వెలుగు దినమునకు సిద్ధపర్చుటకై యేర్పడిన దినము కష్టము తరువాత కష్టనివారణ కలుగును. దుఃఖము తరువాత సంతోషము కలుగును ఇది పరలోకములో నున్న చరిత్ర గనుక నీకు మంగళ స్తోత్రములు.

5. యేసుప్రభువా! మార్కు 16అధ్యాయములో వ్రాయబడియున్నట్లు నీవు ఆదివారమున బయటికి వచ్చినావు అప్పుడు నీవెలుగు వలన కాలినవారు మూర్ఛిల్లిపోయిరి. ఆ మొదటి దినము సృష్టి వెలుగుదినము. గనుక నీకు స్తోత్రార్పణలు.

6. అప్పటినుండి శిష్యులు నీకు నమస్కరించిరి. ఆదివారము నిన్ను స్తుతించిరి. ఆ నమస్కారము సంఘములో నేటివరకు నున్నది. ఆదివారము గుడికి వెళ్ళుట నీకు నమస్కారము చేయుటకే అదే నీకు స్తుతి. ఆదివారము స్తుతిదినము. గనుక 52 ఆదివారములు మేము నీ పునరుత్థానమును

జ్ఞాపకము తెచ్చుకొనవలయును. ఒక ఈస్టరుపండుగ దినముననే కాదు గనుక నీకు స్తుతులు.

7. యేసుప్రభువా, నీ శిష్యులు ఆదివారమున కూడుకొనినప్పుడెల్ల వారి మీటింగులలోనికి నీవు వెళ్ళి వారితో సహవాసము నందు పాల్గొన్నావు కాబట్టి క్రైస్తవులమైన మేము ఆదివారము ఆరాధన పెట్టుకొనుట నీకిష్టమే గనుక నమస్కారములు.

8. ఓ శిష్యులరా, నాలుగువేల సంవత్సరములనుండి ఆచరించుచున్నారు శనివారము మూసివేసి యెందుకు ఆదివారము ఆరాధన పెట్టుచున్నారు. అని నీవు గర్జింపలేదు. గనుక శనివారము ఆచరించక పోవడము నీకు యిష్టము గనుక నీకు ప్రణుతులు.

9.నాలుగువేల ఏండ్లు పాపము ఏలినందుకు భూమి చీకటియాయెను. మరల నీ పునరుత్థానమును బట్టి క్రొత్త సృష్టికలిగినది అదికాకుండ నీనామమును ఎవరెవరు బాప్తిస్మము పొందుదురో అప్పుడు వారు నీయొక్క నూతన సృష్టియై యుందురు. వారికాదినము వెలుగు గనుక వందనములు.

10. పాపి మారుమనస్సు పొందినప్పుడు అది అతనికి వెలుగు దినము అది ఆదివారము వంటిదే గాని శనివారము వంటిది కాదు.

11. అపోస్తలుడైన పౌలు వ్రాసినట్లు మేము పునరుత్థాన బలము పొందవలెను. సాతానును, దయ్యములను, పాపములను, పాపఫలితములగు మరణమును జయించుటకు నీ పునరుత్థానబలము చూపించినావు. ఒకవేళ కావలివారు ఎట్లు పడిపోయినారో, అట్లే పాపములు చేయించు దయ్యములన్నియు పడిపోయినవి. శత్రువులు పడిపోయినారు నీ కాంతికి ఎవరు నిలువగలరు? నీశక్తి ఎదుట ఎవరు నిలువగలరు. లొంగకుండ ఎవరు వుందురు? మరణమునకు గతిలేదు ఇంక ఎవరికి గతియుండును! అంత గొప్ప బలము నేడు అనగా ప్రతీ ఆదివారము దయచేయుదువు కాబట్టి నీకు స్తోత్రములు.



12. ఆదివారము ఉదయమునుండి సాయంకాలము రాత్రివరకు స్తుతి, బజారుకు వెళ్ళుట మాపనికాదు. లోకసంబంధమైన పనిచేయుట మాపనికాదు. దుఃఖము పెట్టుకొనుట మా పనికాదు.యేసు ప్రభువా నీ పునరుత్థాన చరిత్ర నీపునరుత్థానబలము, నీపునరుత్థాన వెలుగు తలంచు కొనకుండుట మా పనికావు. మేమట్లు చేసినయెడల నీవు మమ్ములను క్షమించుము. నిజమైన పట్టుదల ఉపవాస పరులకు ఆవేళ ఉపవాసమే, ఆనంద ఉపవాసమే తెలియని ఆహారము గల దినము. ఆకలి తీరే దినము ఇంతగొప్ప దినమును క్రైస్తవ సంఘము నిర్లక్ష్యము చేయుచున్నది. ఈరోజు అంతా గుడిలో, లేక యింటివద్ద ఈ రెండు స్థలములలో మేము ఉపవాస కార్యక్రమము ఆచరింపగలిగితే మాకు వేలకొలది నోట్సులు చెప్పగలవు. ఎవరికి కావాలి గుడిలో పాదిరిగారు బోధించే దానికంటే నీవు ఉపవాస స్థలములోనే ఎక్కువ బోధిస్తావు. కాబట్టి నీకు స్తోత్రములు. మేము గుడికి వెళ్ళి ఏర్పాటు ప్రకారము ఏకీభవింపవలెను అప్పుడు మమ్మును పాతాళలోక శక్తులు ఏమియు చేయనేరవు గనుక నిత్యస్తోత్రములు.

13. ఓ ప్రభువా, మేము పరలోకమునకు వచ్చినప్పుడు ఆరు రోజులు యిక్కడవుండిపోవును. ఒక్క ఆదివారమే అక్కడకు వచ్చును అక్కడ అంతా పగలే, అంతా వెలుగే, అంతా పునరుత్థాన బలమే, అంతా నీవే, శాశ్వతము వరకు అంతా ఆదివారమే. అంతా ఆరాధనే, అంతా విశ్రాంతియే అంతా సహవాసమే. ఆ మహాభాగ్యము పొందకముందే యిక్కడ ఆదివారము భాగ్యము అలవాటుచేసుకొను కృప దయచేయుము. నీకు ఘన వందనములు.

14. ఆదివారము, ఆదిరోజు, మా జీవితకాలమంతయు, విశ్వాసమును కలిగియున్నయెడల సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శని, ఆదివారములు ఆదివారములే. సంవత్సరములన్నియు ఆదివార సంవత్సరములే, మాతలలో నుండి, మా హృదయములలోనుండి, మా బ్రతుకులలోనుండి ఆదివారము ఎప్పుడు తీసివేయకూడదు ఆ దినము విజయమునకు సూచన దినము.

నీకు స్తోత్రములు. అక్కడ యిక్కడ స్తోత్రములు.

15. క్రైస్తవులు ఆదివారమునాడు తనయొక్క అవసరములను బట్టి చిన్న చిన్న పనులు చేసికొన్నా ప్రభువు ఊరుకొనుచున్నారు. సబ్బాతు దినమున యూదులు పనిచేస్తే మోషే ధర్మశాస్త్రము వారికి శిక్ష విధించెను. యేసుప్రభువు మనలను ప్రతి ఆదివారము శిక్షించిన మతములోనికి ఎవ్వరును రారు. అయితే ధర్మశాస్త్ర ఆజ్ఞ శనివారము గతించిపోయినట్లుగా గతించిపోగా ఆదివారము వచ్చినది. అచ్చటినుండి కృపాశాస్త్రము ఆరంభమైనది. యోహాను 1:8 కృపాశాస్త్రము ప్రకారము మనిషి తన అనుకూలతను బట్టి నడుచుకొనవచ్చును. అననుకూలమైనది క్రైస్తవ మతము యొక్క ప్రేమ నిర్ణయమై యుండవలెను గనుక వందనములు.

16. ఎ) త్రిత్వము ఆదివారమున వెలుగు కలుగును గాక అని చెప్పెను. అది తండ్రియొక్క పని దినమైయున్నది. (బి) పునరుత్థానము ఆదివారము జరిగెను. అది కుమారుడైన దేవుని పనిదినమైయున్నది. (సి) పెంతెకోస్తు ఆదివారమున జరిగెను అది పరిశుద్ధాత్మ పనిదినమై యున్నది. ఈ మూడు దినములు ఆదివారములే. తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు మూడు పనిదినములు మనకు జ్ఞాపకమునకు వచ్చు దినము ఆదివారము. ఇంతకంటే ఆనందకరమైన రోజు ఏది? గనుక నీకు నిత్య మంగళ స్తుతులు.

## కాలోచిత ప్రార్ధనలు

### 1. ఉదయమున లేచినపుడు చేయవలసిన ప్రార్ధన.

ఎ) ప్రేమ గల తండ్రీ మా మీదనుండి గడిచిపోయిన రాత్రి కాల విపత్తుల నుండి కాపాడి యీ ఉదయమున మమ్ములను లేపి మరియొక దినము అనుగ్రహించినందుకు నీకు వందనములు ॥ఆమెన్॥

బి) సృష్టికర్తవైన తండ్రి నేటి దినమున నేను చేయవలసిన పనులలో నాకు తోడైయుండుటకు నీవు కూడా నాతో కలిసి పనిచేయు తండ్రివై



యుందుము ॥ఆమెన్॥

సి) ప్రభువా మా ప్రవర్తన వల్ల నేటి దినమును పరిశుద్ధ దినముగా బైలుపరచుకొను ప్రవర్తనాశక్తి కల్గించుము ॥ఆమెన్॥

డి) దేవా యీ దినమున నీవు నాకు ఏమి చెప్పనైయున్నావో అది చెప్పుము ॥ఆమెన్॥

ఇ) రక్షకుడవైన దేవా, యీ దినమందు మమ్ములను వేటినుండి రక్షింపవలెనో వాటినుండి రక్షింపుము ॥ఆమెన్॥

ఎఫ్) మా కాపరివైన ప్రభువా మమ్మును యే దారిని నడిపింప దలచుకొన్నావో ఆ దారిని నడిపింపుము ॥ఆమెన్॥

జి) దానకర్తవైన ప్రభువా మేము అనుభవించుటకు యీ వేళ మాకు యేమి అందించెదవో అవి అందుకొనే సమర్ధత దయచేయుము ॥ఆమెన్॥

### 2. వేద పఠన చేయకపూర్వము చేయవలసిన ప్రార్ధన

ఎ) వాక్యమును వ్రాయించిన తండ్రీ నేనిప్పుడది చదవబోవుచున్నాను. దీనిలో నుండి నాతో మాటలాడుము నీ మాట నాకు వినబడునట్లు చేయుము ॥ఆమెన్॥

బి) పరిశుద్ధుడవైన దేవా నీ పరిశుద్ధ గ్రంథములో వ్రాయించిన వ్రాతలు నా హృదయములో కూడ వ్రాయించుము ॥ఆమెన్॥

సి) మంచి ఊహలు కలిగించే తండ్రీ నా పరిశుద్ధ గ్రంథము చదువు కొన్నపుడు లేనిపోని ఊహలు రానియ్యక నీవు ఉద్దేశించిన ఊహలు మాత్రమే రానిమ్ము ॥ఆమెన్॥

డి) మాకు కనబడవలెనని కోరే తండ్రీ నా వాక్యములో మాకు కనబడుము. నీ హృదయమును మా హృదయమునకు కనబరచుము ॥ఆమెన్॥

ఇ) జ్ఞానస్వరూపివైన తండ్రీ నీ పత్రములోనున్న విషయములు నేను చదివిన తరువాత వాటిని మరువకుండా నా హృదయమందు భద్రము

చేసికొనే శక్తిని వృద్ధి పొందించుము ॥ఆమెన్॥

ఎఫ్) నిత్యుడవైన తండ్రీ భూమ్యాకాశములు గతించినను నీ వాక్యము మాత్రము గతింపదు. అట్టి నీ వాక్యము అంతయు మా జీవితములో అపహరింపబడకుండునట్లు నీ పరిశుద్ధాత్మ యొక్క వెలిగింపు కలిగింపుము. నీ వాక్యగ్రంథము, నీ గ్రంథవాక్యము నీ భక్తులకు ఉత్తమ లేఖనముగా వినిపించి వ్రాయించిన నీ పరిశుద్ధాత్మ నాలో కూడా అట్టి పని చేయునట్లు విద్యార్థులు వ్రాతపుస్తకములో సిద్ధపరచురీతిగా మా అంగీకార స్వభావమును కూడా సిద్ధపరచుము ॥ఆమెన్॥

జి) పోషకుడవైన తండ్రీ నీ వాక్యమును మానవ బోధకులు కలహ కారణమగు భేదాబేధములైన బోధకులుగా ఉపదేశించుచున్నారు కాబట్టి సరియైన అర్థము మాకు తెల్పుము ॥ఆమెన్॥

**3. దేవుని సన్నిధిలో చేయవలసిన ప్రార్థనలు**

ఎ) తండ్రివైన తండ్రీ నేను యిప్పుడు నీతో మాటలాడ తలంచుకొన్నాను, పిల్లలు తమ తండ్రితో ఎంత చనువుగా మాటలాడుదురో అంత చనువుగా మాటలాడే పరిచయము నాకు అభ్యసింపజేయుము. నా కష్ట సుఖములు నీతో చెప్పుకొనేటప్పుడు నాలోనున్న భయము అనుమానము తీసివేయుము అనగా అవి చెప్పుకుంటే తండ్రికి కోపమేమో అని భయపడే బెదురు లేకుండా చేయుము ॥ఆమెన్॥

బి) తండ్రీ! నీ వాక్యములో నుండి నాతో మాట్లాడినావు గనుక యిప్పుడు నేను నా ప్రార్థన ద్వారా నీతో మాట్లాడుటకు తెగించుచున్నాను నా ప్రార్థన మనవులతో మాత్రమే కాక స్తుతులతోనిండి యుండునట్లు నా ప్రార్థన పూర్తిచేయుము ॥ఆమెన్॥

సి) సమస్తము నా కొరకు కలుగజేసిన తండ్రీ! మేము అడిగే వాటికంటే ఎక్కువ దయచేయగల శక్తిమంతుడవు అని గ్రంథములో నున్నది, గనుక అడిగినవియు నీవు యియ్యదలంచు కొన్నవియు మాకు స్వాధీనపర్చుము ॥ఆమెన్॥



డి) ఇచ్చుటకై మాయెదుట కూర్చుండియున్న తండ్రీ! అడిగేవి మాకు రాకముందే వచ్చే ఉన్నవి అని నమ్మితే అప్పుడు అవి వచ్చును అని వ్రాయించిన తండ్రీ నీకు స్తోత్రములు. ఈ వ్రాతలోనున్నది అనుభవించుటకు మాకు మహాద్భుతకరమైన విశ్వాసబలము అగత్యము అదే మాలో పుట్టించుము ॥ఆమెన్॥

ఇ) త్రియేక దేవుడవైన తండ్రీ నా చిత్తప్రకారము అడిగేవి నిశ్చయముగా మాకు యిస్తావని యోహాను పత్రికలో వ్రాయించినావు. గనుక మా చిత్తమును ప్రార్థనలో తెలియపరచుకొని దానిని నీ చిత్తమునకు సమర్పించే చిత్తము మా చిత్తమై ఉండేటట్లు చేయుము ॥ఆమెన్॥

ఎఫ్) నీ కుమారుని ద్వారా బైలుపడిన దేవా! తండ్రీ ప్రభువా రక్షకా నీకు వందనములు ఎందుచేతనంటే నా నామమందు మీరు నన్ను ఏమి అడిగినను దానిని చేతును అని వాగ్దానము చేసిన నీకు వందనములు. ఇది అన్ని వాగ్దానములను ప్రోగుచేసి చూపిన వాగ్దానముగా కనబడుచున్నది. నీకు స్తోత్రము. మేము ప్రార్థన చేయునప్పుడెల్లా యోహాను 14:14; మార్కు 11:25; 2యోహాను 5:1 జ్ఞాపకము తెచ్చుకొని ప్రార్థించే శ్రద్ధ మాలో నుండునట్లు చేయుము ॥ఆమెన్॥

(పై మూడు వాక్యములు జ్ఞాపకము చేసికొని ప్రార్థన చేస్తే అన్ని ప్రార్థనలు నెరవేరును)

**4. సేవ చేయునప్పుడు అనగా సువార్త ప్రకటించునప్పుడు చేయవలసిన ప్రార్థన**

ఎ) సర్వజనుల యొక్క అధికారివైన దేవా! నన్ను మాత్రమే కాదు. అందరిని రక్షించుట నీకు యిష్టము నన్ను రక్షించినావు గనుక యితరులు రక్షింపబడేటట్లు నాకు సువార్త చెప్పి వేళ్ళే సమయము దయచేయుము ॥ఆమెన్॥

బి) నాయకుడవైన ప్రభువా, యెక్కడికి వెళ్ళవలెనో అక్కడకు నేను కాలపరిస్థితులను బట్టి వెళ్ళేటట్లు నా జ్ఞానమును ఉపయోగించే కృప

దయచేయుము ॥ఆమెన్॥

సి) వాక్కు నేర్పే తండ్రీ మేము మనుష్యులతో మాటలాడేటప్పుడు మా యిష్టము వచ్చిన మాటలు కాక మా సర్దామాటలు కాక, మా హృదయములకు తగిన మాటలే చెప్పేటట్లు మాకు వాక్కు దయచేయుము ॥ఆమెన్॥

డి) యుక్త సమయములయందు, యుక్త వాక్యములు అందించే తండ్రీ మేము నీ వాక్యము చెప్పేటప్పుడు కొందరిలో ఫలించదు కొందరిలో ఫలించును. అయినను వాక్కు అందించుము. ఎందుకంటే మూర్ఖతనము గలవారికి అది శిక్షగా నిలువబడును. విధేయత గల వారికి పరమవిందుగ నిలువబడును, వినబడును. ॥ఆమెన్॥

ఇ) ఎన్నడు నీ వాక్యముఖము యెరుగని సజ్జనులున్నారు, అట్టి వారి యొద్దకు నన్ను పంపుము వారి అజ్ఞానమును తొలగింపగా నీ వాక్య వివరణ ధోరణి నాలో నుండి యూటయై రప్పించుము. ఓ సర్వజ్ఞానీ ॥ఆమెన్॥

ఎఫ్) జాగ్రత్తగా ఆలోచించే ఆత్మను దయచేసే తండ్రీ, కుప్పలు కుప్పలుగా మా మీదపడే చిక్కు ప్రశ్నలకు యేమి జవాబు చెప్పవలెనో అది మాకు ఒక ఉపాధ్యాయునివలె మా ప్రక్కనుండి చెప్పించుము. సాతాను మాటలకు యెవ్వరును యెదురు చెప్పలేకపోయిరి. అంటే మా మాటకు కూడా యెదురు చెప్పక ప్రశ్నల జవాబులు విని మనుష్యులు ఆనందించేటట్లు మాకు వారికి కృపదయచేయుము ॥ఆమెన్॥

జి) నీ వాక్యము తెలిసిన వారికి మేము నీ వాక్యము విడచెప్పేటప్పుడు వినేవారు తమ అజ్ఞానమును తెలిసికొన్నవారై ఎమ్మాయి శిష్యుల యొక్క హృదయములో మంటపుట్టినట్లు వారి హృదయములో కూడా మంట పుట్టి వారికి జ్ఞానోదయము కల్గుమార్గము సరాళము చేయుము. ॥ఆమెన్॥

**5. పరుండబోవునప్పడు చేయవలసిన ప్రార్థన**

ఎ) ఆరుదినములు పనిచేసి ఏడవదినమున విశ్రమించిన సృష్టికర్తవైన నా దేవా! నీకు స్తోత్రములు.



మాకు కూడా ఈలోకములో విశ్రాంతి యేర్పరచినావు పగలు అంతయు పనిమీదనున్న మాకు విశ్రాంతి కలుగునట్లు రాత్రిసమయము యిచ్చినావు. ఇప్పుడు పరుండబోవుచున్నాము సుఖనిద్ర కలిగించుము. ॥ఆమెన్॥

బి) లోకములోని మా జీవితకాలమంతా పనిచేసిన తరువాత పరలోకమందు మాకు నిత్య విశ్రాంతి నియమించినావు అది తలంచుకొని యది కడవరి తలంపుగా తలంచుకొని పరుండబోవుచున్నాము ఆలకించుము ॥ఆమెన్॥ దీవించుము ॥ఆమెన్॥

సి) నా ప్రియుడవైన తండ్రీ! నా శరీరము, నా ఆత్మ, నాకు కలిగిన సమస్తము నీకు అప్పగించి నేను నిద్రపోవుటకు వెళ్ళిపోవుచున్నాను. అంతయు నీవే చూచుకొనుము ॥ఆమెన్॥

డి) సర్వజన జనకుడా! నేను, మా వారు నిద్రమీద నున్నప్పుడు నీ పరిశుద్ధ దూతలను మా చుట్టు కావలిగాయుంచుము ॥ఆమెన్॥

ఇ) ఓ తండ్రీ! నా తండ్రీ! నన్ను ప్రేమించే తండ్రీ నేను నీకు ముద్దాయిగా యుంటాను గనుక ఉదయమున నేను లేవకముందు నీవు వచ్చి నన్ను పరలోకమునకు తీసుకొని వెళ్ళిన అది ప్రేమయే గనుక వందనములు ॥ఆమెన్॥

ఎఫ్) కాపాడే తండ్రీ! విమోచకుడవైన తండ్రీ! చీమలు, దోమలు, ఈగలు, జెర్రిలు, తేళ్ళు, పాములు, జంతువులు, దొంగలు, మాకు హాని కలిగించే దయ్యములు మా యొద్దకు రాకుండ కాపాడుము ॥ఆమెన్॥

జి) మేము మా కన్నులు మూసికొనియుండగా నీ కన్నులు తెరచి మమ్మును చూస్తుయుండే తండ్రీ! నీకు స్తోత్రములు ॥ఆమెన్॥

మంచి ఆలోచన, మంచి కలలు, నీ చిత్తమైతే మంచి దర్శనములు మాకు సంభవించేటట్లు కృప దయచేయుము, ఉదయమున శ్రమతీరి సుఖముగా లేచునట్లు కృప దయచేయుము ॥ఆమెన్॥

**6. భోజనము చేయునప్పుడు చేయవలసిన ప్రార్ధన**

ఎ) మా పోషకుడవైన తండ్రీ! మేము జీవించునట్లు ఆహారమును ఒక పదార్ధముగా యిచ్చినందున నీకు వందనములు. మేము భోజనము భుజించుట వల్ల నీకు కీర్తి రావలయునని కోరుచున్నాము ॥ఆమెన్॥

బి) పోషకుడవైన తండ్రీ! మేము ఆహారమును సంపాదించే శరీరము మాకు దయచేస్తే నీవు యేర్పరచిన ఆహార పదార్ధములు సంపాదించగలము. అవి మాకు సమృద్ధిగా దొరికేటట్లు నీ దీవెన దయచేయుము ॥ఆమెన్॥

సి) పోషకుడవైన తండ్రీ! ఈ యాహారము వల్ల రెండు మేళ్ళు దయచేయుము. మొదటిది అనారోగ్య నివారణ, రెండవది ఆరోగ్యార్ధమైన బలము, పుష్టి, జ్ఞానము, ఆయుష్షు ఇవి దయచేయుమని వేడుకొనుచున్నాము ॥ఆమెన్॥

డి) పోషకుడవైన తండ్రీ! ఈ శరీరాహారము భుజించునప్పుడు మా ఆత్మకు యిచ్చుచున్న ఆత్మాహారము మాకు జ్ఞాపకము చేయుము అప్పుడు మాకు రెండు సంతోషములు ॥ఆమెన్॥

ఇ) పోషకుడవైన తండ్రీ! విచారము, భయము, దిగులు, అనుమానము, అసహ్యము కలిగించు విషయమును భోజనసమయమందు మా మనస్సులోనికి రానీయకుము గాని సంతోషము కలిగించే సంగతులు మాత్రమే రానిమ్ము ॥ఆమెన్॥

ఎఫ్) పోషకుడవైన తండ్రీ! లోకములో అనేకమంది బీదలున్నారు. వారికి ఆకలి తీర అన్నము దొరకదు. వారిని కనిపెట్టుము. అన్నదాన సమాజములను వర్ధిల్లజేయుము. ॥ఆమెన్॥

జి) "నాకేమి కొదువ నాధుడుండ" అనే కీర్తన భోజన సమయమందు పాడుకొనవలయును. ''పగవారల్ సిగ్గు'' అనే చరణము కూడ పాడుకొనవలెను.



ప్రార్ధన : తండ్రీ! కొంతమందికి ముఖ్యముగా బీదలకు ఏ కొంచెము అన్నము పెట్టినా సంతోషించెదరు. కొందరెంత పెట్టినా సంతోషింపరు. అలాగే ప్రభువా! ఈ దినమున మాకెంత వర్తమానమిచ్చినావో అంతటితో సంతృప్తిపడు కృప దయచేయుము ॥ఆమెన్॥

షరా : (నేను మచ్చునకు చెప్పినాను, మీరు అనేక వాక్యములు చేర్చుకొని సంపూర్తి చేసికొనండి)

ప్రతి ప్రార్ధన ప్రభువుతో ముగింపవలెను. 1) ఈమా ప్రార్ధనలు అన్నియు నెరవేరే నిమిత్తమై నీ ప్రియకుమారుడును మా ప్రాణ రక్షకుడును మిక్కిలి త్వరలో రానైయున్న వరుని ద్వారా ఆలకింపుము. ఇది ప్రతి ప్రార్ధనకు చివర వాడవలెను. 2) నీతోను పరిశుద్ధాత్మతోను యేక దేవుడుగా పాలించు చున్న నీ కుమారుని పరిముఖముగా మా ప్రార్ధనలు ఆలకింపుము ॥ఆమెన్॥

## సృష్టి కొరకైన ప్రార్ధన

1. తండ్రీ! నీవు కలుగజేసిన సృష్టిలో ప్రతిజీవిని ప్రతి వస్తువును ప్రతి నిమిషము దీవించుచుండుము (యెషయా 27:3)

2. తండ్రీ! నీవు కలుగజేసిన సృష్టి అంతటికి నరవాక్కు నిచ్చి క్రీస్తు ప్రభుని గురించిన సమాచారమును భూలోకములోనున్న ఒక్కొక్కరికి స్వప్నముతోనో, దర్శనముతోనో అందించుము.

3. తండ్రీ! నీవు మా అన్ని ప్రార్ధనలు విన్నందుకు నీకు స్తోత్రములు. నీ లక్షణ స్తోత్రములతో పాటు సృష్టి యావత్తుచేత స్తుతి మోత మ్రోగించుము ॥ఆమెన్॥

## ఆర్య సమాజమును గురించిన ప్రార్ధన

1. తండ్రీ! వీరు బైబిలులో చాలా తప్పులున్నవని చెప్పుచున్నారు గనుక క్రీస్తు ప్రభువులోని దైవత్వము వారికి చూపించుము.

2. తండ్రీ! వీరు క్రీస్తులో తప్పులున్నవని చెప్పుచున్నారు.

3. తండ్రీ! క్రైస్తవమత సంఘములో తప్పులున్నవని వారు చెప్పుచున్నారు గనుక వారి నేత్రములు విప్పుము. క్రైస్తవులలో తప్పులున్నవని అనుమాట నిజమే కాని సంఘములో లేవు అని చూపింపుము మరియు వారిని క్షమించి వారిని క్రైస్తవ బోధకులనుగా మార్చుము. పిచ్చివాడైన గెదరెనీయుని మార్చి స్వదేశ మిషనెరీగా పంపినావుగదా అట్లే వీరి విషయములో కూడా చేయుము.

## యుద్ధములను ఆపుచేయు ప్రార్ధన

1. తండ్రీ! దావీదు కీర్తనలయందు నీవు యుద్ధము మాన్పువాడవు అని వ్రాయించినావు యుద్ధములను ఆపుచేయుము. లేనియెడల అనేకమంది నాశనమగుదురు. చాలా ధనము వ్యయమగును.

2. యుద్ధాయుదములు, మనుష్యులను నాశనము చేసే ఆయుధములుగా చాలా తయారుచేసినారు, అవన్నియు నాశనము చేయుము.

3. క్రైస్తవులు యుద్ధము చేయుట చాలా విచారకరమైన సంగతి పాతనిబంధనలో దేవుడే యుద్ధములు చేయించినాడు గనుక యుద్ధములు బైబిలే నేర్పుచున్నదని యితర మతస్థులు నిందించుచున్నారు. ఎందుకంటే యూదులను నాశనము చేస్తే యూదులలో పుట్టవలసిన క్రీస్తు పుట్టాడు అని సైతాను యితరులలో ప్రవేశించాడు. గనుక యుద్ధములు అవసరమై యుండెను అయినప్పటికి యుద్ధములలో చనిపోయినవారిని పాతాళ లోకములో పెట్టి వారికే బోధ చేయించుము వారికి మారుమనస్సు కలిగించి మోక్షమునకు చేర్చుము ॥ఆమేన్॥

## కుటుంబముల కొరకై ప్రార్ధన

1. ఓ దేవా! కుటుంబమున చాలామందికి బిడ్డలను యిచ్చినావు. సంతోషమే కాని వారికి మంచి లక్షణములు యిమ్మని వేడుకొనుచున్నాము. వారిని భక్తిమార్గములో పెంచుటకు తల్లిదండ్రులకు శక్తికూడా యిమ్మని వేడుకొనుచున్నాము. పిల్లలు సరియైన స్థితిలో లేనప్పుడు వారిని ఎట్లు



మళ్ళింపవలెనో నేర్పుము. బాగాయున్నప్పుడు నడిపించుట సుళువే అప్పుడు తల్లిదండ్రులకు అంతపని ఉండదు. పిల్లలు తప్పుదారి నడిచేటప్పుడు వారిని మళ్ళించే గొప్ప పనియుండును తల్లిదండ్రుల భక్తి, జ్ఞానము, మనస్సాక్షి, శరీరబలము సమయము వాడుకొనుటకు అదే మంచి సమయము. కాబట్టి అందరికి అట్టి తరుణము దయచేయుము. అబ్రహాము యెవ్వరిమీద కోపపడినట్లు లేదు అతనితో నున్నవారు సరిగా ఉన్నారు. గనుక కోప్పడవలసిన అవసరము లేదు దిద్దవలసిన అవసరము లేదు. నేటి కాలపు పిల్లలు క్రమము తప్పినారు తల్లిదండ్రులు వారిని మళ్ళించుటకు ఎక్కువ కష్టపడవలెను అది వారికి దయచేయుము. “పిల్లలు చెప్పినమాట వినరు” అని నీ వాక్యములో పౌలుచేత వ్రాయించినావు గదా అది యిప్పుడు నెరవేరుచున్నది. గనుక బాగుచేయుట కూడా నెరవేరవలెను. పిల్లల విషయములో పూచి తల్లిదండ్రులే గనుక తమ విధితమే నెరవేర్చుకొన వలెను. శక్తిగల ప్రభువా! ఓ ఎల్ షద్దాయ్! వారికి శక్తి దయచేయుము, నడుపుటకు నడచుటకు ఈ రెండు శక్తులు దయచేయుము. ॥ఆమేన్॥

ఇక ఇంటిలోనికి వ్యతిరేకమైన శక్తి వచ్చునప్పుడు దానిని ఎదిరించుటకు పరలోకములోనుండి, ఎల్‌షద్దాయ్‌నుండి శక్తిరాకమానదు.

1. దయగల తండ్రీ! కుటుంబములో పిల్లలు ఒకశాఖకు, సంబంధించి యున్న ఆశాఖ పేరు సర్వ స్వతంత్ర్యశాఖ, అందుచేత తల్లిదండ్రులు చెప్పిన మాట వినక తమకు తోచిన ప్రకారము చేస్తారు. అందుచేత తల్లిదండ్రులకు బాధ. ఇది అనేక పర్యాయములు జరుగుచున్నది. ఈ కుటుంబములలో అట్టిది జరగకుండా చేయుమని మా ప్రార్ధన.

2. మరియొకశాఖ : ఏదైన అడిగితే నిజముచెప్పక అబద్ధము నిజమువలె యెంతో నిజముగా యున్నట్లు దృఢముగా చెప్పుదురు. ఇది పరిహరింపుము.

3. ఇంటిపట్టున ఉండక తమకు యిష్టమైన చోట్లకు వెళ్ళుదురు ఇది కూడ పరిహరింపుము.

4. "బడికి వెళ్ళవలసినది" అని చెప్పి ఎక్కడికో వెళ్ళి "యిప్పుడే బడి అయిపోయినది" అని చెప్పుదురు ఈ దుర్గుణమును పరిహరింపుము.

5. బడిలో పాఠములు సరిగా నేర్చుకొనక ఫెయిల్ అయితే నిన్ను ధూషింతురు ఇది కూడ పరిహరించుము.

6. ఇంటిలో ఏదైనా ఎత్తుకొనిపోయి అమ్ముకొందురు, స్నేహితులకు పంచిపెట్టుదురు. పొరుగువారు వెళ్ళుదురు. ఎందుకు యిలాగు చేసితిరని అడిగితే మాకు వెళ్ళమని స్వరము వినబడినది. అందుచేత వెళ్ళినాము అని అందురు. వినబడటం నిజమేగాని అది దురాత్మ చెప్పునని వారికి తెలియదు. అది వారికి తెలియజెప్పుము.

7. వారిని తల్లిదండ్రులు శిక్షించితే మరింత మొద్దుబారుదురు. ఈ మొండితనమును పరిహరించుము.

8. ప్రార్థనలో యుండవలెను బైబిలు చదవవలెను, కీర్తనలు పాడవలయునని చెప్పితే "నీవు చెప్పినట్లుచేయు బుద్ధిమాకు కలుగుటలేదు" అని అందురు ఈ దుర్గుణము కూడ పరిహరింపుము.

9. మీలో దుర్మార్గత ఉంది అని చెప్పితే ఏమాత్రమునమ్మరు. ఓ ప్రభువా ఈ కాలమందు సాతాను కొందరికి మతి చాంచల్యము కలిగించు చున్నాడు. కొందరిని ఎక్కడికో తీసికొనవెళ్ళి అక్కడ పరుండబెట్టుచున్నాడు వారికి తెలియదు మరియు పిశాచి బిక్షకునివలె కనబడి కొంతమందికి మాయ మాటలు చెప్పి క్రైస్తవులు యేసుప్రభువే అని భ్రమపడుదురు పరీక్షింపకుండా బిక్షము వేయకూడదు మరియు అనవసరముగా అతడు భయము పుట్టించును జాగ్రత్తగా ఉండవలెను.

## అనుదినము చేయవలసిన ప్రార్థన

1. సర్వశక్తిగల దేవా అనేకమంది రోగులను బాగుచేసినావు మమ్ములను బాగుచేయుము.

2. అనేకమంది అనారోగ్యవంతులకు ఆరోగ్యమిచ్చినావు మాకును



ఆరోగ్యము దయచేయుము.

4. అనేకమందికి నా వాక్యము వినిపించినావు మాకును నీ వాక్యము వినిపించుము, బోధించుము.

5. అనేకమందికి నీ వాక్యప్రకారము నడుచుకొను శక్తియిచ్చినావు మాకు కూడా అట్టి శక్తియిమ్ము.

6. అనేకమందికి యేదో యొక వరమిచ్చినావు మాకు కూడా నీకిష్టము వచ్చిన వరము యిమ్ము.

7. అనేకమందికి నీ సేవచేయు సమయము, శక్తి యిచ్చినావు మాకు కూడా అట్టి సమయము, శక్తినిమ్ము.

8. అనేకమందికి నీ సన్నిధిలో సమస్త అంశముల ప్రార్థనలను చేసే సమయమిచ్చినావు. మాకు కూడ అట్టి తరుణము దయచేయుము.

9. అనేకమంది ద్వారా నీవు కీర్తి పొందినవాడవు మా ద్వారా కూడా కీర్తి పొందుము.

10. అనేకమందికి శత్రుబాధ తొలగించినావు మాకు కూడా శత్రుబాధ తొలగింపుము.

11. అనేకమందిని విషసంబంధమైన పురుగులు, దుష్టమృగములనుండి తప్పించినావు. మమ్ములను కూడా వాటినుండి తప్పించుము.

12. అనేక మంది అవమానమునుండి తప్పించినావు. మమ్ములను కూడ తప్పించుము.

13. అనేకమందిని శీతోష్ణ స్థితి బేధములనుండి తప్పించినావు మమ్ములను కూడ తప్పించుము.

14. మమ్మును ఏ ఉద్దేశ్యముతో కలుగజేసినావో ఆ ఉద్దేశ్యమును నెరవేర్చు వరకు మమ్ములను విడిచి పెట్టకుము.

15. అనేకమందికున్న ఆటంకములను తొలగించినావు మాకు కూడ నున్న ఆటంకములను తొలగింపుము.

16. మాలో యెవరికి మరణము అవసరమో వారికి నెమ్మదిగల మరణమిమ్ము.

17. మాలో యెవరు రెండవరాకడకు సిద్ధపడవలెనో వారిని సిద్ధపర్చుము.

18. మా దర్శనములన్నియు నెరవేర్చుము. మా మంచి యూహలు, కోర్కెలు నెరవేర్చుము.

19. మా జీవిత కాలమంతయు నీ తలంపుతో నింపుము.

20. అధైర్యము, అవిశ్వాసము, భయము, తాత్కాలిక భక్తి యివి మాలోనికి రాకుండ కాపాడుము.

21. మేము మా ప్రార్ధనలో యేవి విడిచిపెట్టినామో అవి కూడా నీకు సమర్పించుచున్నాము.

22. మరియు మమ్ములను, సర్వజనులను, మృగాదులను, పక్షులను, వృక్షాదులను, నీ సర్వసృష్టిని కాపాడుము.

23. ఎప్పటికప్పుడే సాతాను యొక్క క్రియలను లయము చేయుము.

24. మా జీవిత కాలమంతయు, నీ దేవదూతల యొక్క సహాయమును అనుగ్రహింపుము.

25. మా అజ్ఞానము, మా అయోగ్యత, మా పాపస్థితి ఎప్పటికప్పుడే తొలగించుము, పరిశుద్ధ స్థితిలో స్థిరపర్చుము.

26. తండ్రి కుమార పరిశుద్ధాత్మ అను త్రియేక దేవుడువైన నీవు మాకు యిచ్చిన వాటిలో ఏమియు పోగొట్టుకొనకుండా కాపాడుము.

27. అన్ని మంచి విషయములలో మాకు వృద్ధికలుగజేయుము.

28. మేము భూలోకములో ఉన్నప్పటికిని మా పేర్లు పరలోకములో నీ కుమారుని ద్వారా రిజిష్టరు చేయుము.

29. ఆయన ద్వారా నీకు ఆది స్తుతి, మధ్యస్తుతి, జీవాంతస్తుతి, కష్టకాలస్తుతి, ఆనందకాల స్తుతి, ఏమియు తెలియక తోచకయుండు



కాలమందలి స్తుతియు, సంఘటనము యొక్క స్తుతియు, మా జన్మము మొదలుకొని కడవరి భూలోక నిమిషము వరకు నీకు ఋణపడిన స్తుతియు, పరలోక స్తుతియు, అంగీకరించుమని మిక్కిలి వినయముతో వేడుకొనుచున్నాము. ఆమెన్.

## స్విచ్ఛ్ ప్రార్ధన (బంధింపు ప్రార్ధన)

యేసుప్రభువా యీవేళ లేచిన వెంటనే స్విచ్ఛ్ ప్రార్ధన చేయుచున్నాము. (మత్తయి 18:18)

మనము చేయవలసిన ప్రార్ధనలు అన్నియు చేసి ముగింపవలెను. స్విచ్ఛ్ మనము వేయగానే వెలుగురాదు. అయినప్పటికిని మరియొక మారు నొక్కముగాని, వెలుగు వచ్చువరకు కనిపెట్టుదుము. నొక్కుట అవసరము లేదు రెండవ రాకడ సమీపమందున్న మనము త్వరగా ప్రార్ధనలు కాలానుసారముగా చేసి కనిపెట్టవలెను. అప్పుడు ఇశ్రాయేలీయులు ఎఱ్ఱ సముద్రము వద్ద తమ శత్రువుల వలన కలుగవలసిన బాధనుండి విమోచితులైన రీతిగానే మనము విమోచితులమగుదుము. భూమిమీద మనము బంధించువాటిని పరలోకమందు ప్రభువు బంధించును. మనము వేటిని విప్పుదుమో వాటిని పరలోకమందు ప్రభువు విప్పును. మన యిష్టము ఈ రెండు వాక్యములలో (పంక్తులలో) మన యిష్టమును మన స్వాతంత్ర్యము బట్టి మన చిత్తము కనబడుచున్నది. ఇది యెంత ధన్యత, అనేక మంది భక్తులే ఈ ధన్యతను పోగొట్టుకున్నారు. పరలోకమందు వెలుగు ఉన్నట్లు భూలోకమందును మన ప్రార్ధన గదిలో ప్రార్ధన వెలుగువలె నుండును.

## ప్రత్యేకమైన ప్రార్ధన మత్తయి 6:6.

మనకు తెలిసిన వాక్యములు సందర్భానుసారముగ చదువుకొనిన యెడల క్రొత్త వెలుగు దానిలోనుండి బయటికి వచ్చును.

1. త్రియేక దేవుడవైన తండ్రీ! విపత్తుకాలములో మేము నీకు ఒక

మనవి చేయుటకై సంతోషముతో వచ్చియున్నాము. విచారము, భయము, స్వేచ్ఛలేనితనము ఉండవలసిన సమయమిదే. అయినను మీ వాక్య వాగ్దానమును బట్టి సంతోషము, ధైర్యము, స్వేచ్ఛ, సేవలో తీవ్రత కలిగి యుండవలసిన సమయము కూడా యిదే. మొదటి శతాబ్దములో ఈ సంఘమును వ్రేళ్ళతోపాటు నాశనము చేయవలెనని యుద్దేశించి సర్వ భూగోళ చక్రవర్తులు రోము దేశమును ఏమియు చేయలేకపోయిరి. అందుచేత ఈ సంఘము ఒక నదివలె యిరువది శతాబ్దముల వరకు ప్రవహించుచు వచ్చుచున్నది. ఇది నీ ప్రభావము గనుక నీకు స్తోత్రములు.

2. మా కాలములో మా దేశములో నీ సంఘము యొక్క మా సంఘము యొక్క మేళ్ళు అనేక విధములుగా అనుభవించుచున్న అనేకులు నీ సంఘమును వృద్ధి కాకుండ చేయవలెనని క్రైస్తవులు దేశమతములోనికి రావలయునని దేశమతముయుండగా పరదేశమతము ఎందుకనియు వాదించుచున్నారు. మరియు బైబిలులో సంగతులు అనేకములున్నవని ద్వేషభావముతో పలుకుచున్నారు. పత్రికలు వేయుచున్నారు, గ్రంథములు ప్రచురించుచున్నారు. గనుక దేవా! వారి ఆలోచనలు బంధించుము. వారి మాటలను యుపన్యాసములను బంధించుము. వారి పత్రికాదులను బంధించుము. వారి యితర ప్రయత్నములను బంధించుము. అనగా హాని చేయు ప్రయత్నములను బంధించుము. ముందుగా మేము ప్రార్థనగదిలో వాటిని బంధింపగల చురుకుతనము దయచేయుము. భయమును, అపనమ్మక మును మాలోనుండి తీసివేయుము. అప్పుడు మేము బంధింపగలము.

3. మన శత్రువులను ఇశ్రాయేలీయుల యొక్క శత్రువులను చెలరేగనిచ్చు నట్లు చెలరేగనిచ్చుట అనగా చెలరేగుచుండగా నీవు యూరకుండుట మాచేత ప్రార్థన చేయించుటకును మౌనముగా నున్నావు గనుక వందనములు.

4. వారు యేయే ప్రయత్నములు చేయుచున్నారో ఆయా ప్రయత్నములకు మించిపోవు ప్రయత్నములు మేము సదుద్దేశ్యముతో చేయులాగున మాకు



శాంతి మనస్సును, జ్ఞానోదయమును అనుగ్రహింపుము.

5. మరియు వారు దేవతలను ప్రార్థించుచుండగా మేము నిన్ను ప్రార్థించుచున్నాము. వారు బోధన ప్రచారము చేయుచుండగా మేము కూడ సద్బోధన ప్రచారము చేయునట్లు మా నోళ్ళకు సత్తువ దయచేయుము వారు బాహాటమైన సభలలో గంభీర్యమగు ధూషణోపన్యాసములు చేయుచుండగా “మేము నిన్ను అడుగు ప్రతిదానికి సమాధానము చెప్పుము” అను నీ వాక్య ప్రకారము న్యాయమైన రీతిని నచ్చచెప్పగల యుపన్యాసములు మా గుండెకు సత్తువ, మా జ్ఞానమునకు శక్తి సమాధానము చెప్పగల వాక్యములు జ్ఞప్తికి అందించుము. ఎందుకనిన “మీరు కాదు వారికి ఏమి జవాబు చెప్పవలెనో యది ఆత్మయే మీకు అందించును” అని వ్రాయించినావు గదా! (మత్తయి 10:19,20) గనుక మాకు నీ ఆత్మ సహాయము చూపించుము, దర్శనవరము గల వారికి ప్రత్యక్షమగును. వారి పత్రికలకు, పుస్తకములకు తగిన జవాబు వ్రాయుటకై మా హస్తములకు చాకచక్యము వానిని అచ్చువేయించుటకు ధనరాశిని సమకూర్చుము వారు కుట్రాలోచన చేయుచుండగా మేము మంచియాలోచనలు చేయుటకై మాకు మంచి యాలోచనను పుట్టించుము.

6. మా ప్రభువు సిలువ మ్రానుమీద నున్నప్పుడు “తండ్రీ వీరు ఏమి చేయుచున్నారో వీరికి తెలియదు గనుక క్షమించుము” అని ప్రార్థించిన విధముగ మేము కూడ ప్రార్థించునట్లు మమ్మును క్షమాపణ స్థితికి నడిపింపుము మరియు తండ్రీ వారిని కాదు వారి యొక్క దుష్ట ప్రయత్నము లను దుంపనాశనము చేయుము. ఈ సమయమందె చైనాలో జరిగినట్లు మా దేశస్థులు బైబిలు కొరకు బైబిలు సొసైటీ వారికి వ్రాసుకొనునట్లు ప్రేరేపించుము. ప్రజలందరు మాకు క్రైస్తవ బోధనలు, క్రైస్తవ పత్రికలు, పుస్తకములు కావలెనని కేకవేయు ఆర్భాటశక్తి ప్రజలలో కల్గించుము.

7. ఓ దేవా! అంతములేని కృపగల దేవా! నీకు స్తోత్రములు. సాతాను తనకు యెక్కువ సమయము లేదని చెలరేగి విశ్వాసుల మీద పడుచున్నాడు.

అతని ఆలోచనలు సాగనీయకుము. అతని ప్రయత్నములు నెరవేరనీయకుము. అతని పన్నాగములను చెడగొట్టుము, యూఫ్రటీస్ నదియొద్ద నాలుగు భూతములను నీవు బంధించినావు అలాగుననే యిప్పుడును లోకమంతట తిరిగే భూతములను వాటి యొక్క పనులను నీవు బంధించుము ॥ఆమెన్॥

షరా : 1) మన దృష్టిలో యెవరైన బంధింపబడిన వారిని తలంచుకొని ఈ పైన వ్రాసిన విధమున ప్రార్థింపవలెను. 2) సాతాను ఎదిరింపులు పేజి 6లో 9వ ఎదిరింపును చూడండి.

## ఇంజక్షను ప్రార్థన

ఓ దయగల ప్రభువా! సంఘము పూర్వకాలము కంటే ఈ కడవరి కాలములో బైబిలు గ్రంథము విప్పి యెక్కడ చదువుకొన్నను సరే యేవచనము చదువుకొన్నను సరే ఆ వచనములో నుండి సంఘము యొక్క శరీరములోనికి శక్తి, యింజక్షనువలె వెళ్ళేటట్లు చేయుము. (అది వరకు చదివేది వేరు ఈ కడవరి కాలంలో ఒక్కసారి చదివేది వేరు ఇప్పుడు అయ్యగారు చెప్పిన తరువాత చదివేది వేరు. కాగితాలు తిరగవేసి యెక్కడ చదివినను సరే ఆకాను, యూదా, అననీయ సప్పీరాలు కథ. కయ్యాను కథ చదివినను సరే సొదొమ వీరి కథలు కంటబడితే ఇవి దుశ్శఖునములాగున్నదని అనుకొనకుండ చదువుము. దేవుని వాక్యములో దుశ్శఖునములు లేవు అకస్మాత్తుగా చంపే యింజక్షనులేవు. అన్ని బలహీనతలను తోలి బలపరచే యింజక్షనులే అని సంతోషించండి.)

ఓ ప్రభువా! బైబిలులో మాత్రమే కాక నీ భక్తులైనవారు ఆత్మ ప్రేరేపణ చేసే యుపన్యాసకులు కూడ మాకు, సంఘమునకు మంచి యింజక్షనులు అయ్యేటట్లు మార్చుము. యేసుప్రభువా, అవిమాత్రమే కాక సంఘమునకు కలిగే హింసలు కూడ మంచి యింజక్షనులుగా అయ్యేటట్లు మార్చుము. యేసుప్రభువా! ఈ వేళ కూడ మాకు క్రొత్త వర్తమానము దయచేయుము. అదికూడ ఒక యింజక్షను అవునుగాక నీకు మహిమ, సంఘమునకు



జయము. అపవాది క్రియలకు లయము నీ రక్తము సంఘమునకు పుట్టించుము. (సంస్కారము ద్వారా) నీ రక్తమే సంఘమునకు యింజక్షను చేయుము ॥ఆమెన్॥

## మిశ్రమ ప్రార్థనలు

1. ప్రార్థన: ఓ దయగలతండ్రీ! నీవు ప్రార్థనలు వినువాడవగుట వలన నీ సన్నిధికి వచ్చి యేదైన చెప్పుకొనవచ్చుననియు అడుగుకొన వచ్చుననియు తెలిసి నిన్ను స్తుతించుచున్నాను. నాకు కావలసినవి నీకు ముందుగానే తెలిసినను అడుగుడి మీకియ్యబడునని చెప్పినావు గాన నీ మనవులన్నియు నీ యెదుట సమర్పించుకొనుచున్నాను.

ఓ తండ్రీ! నాకు యేమియ్యవలెనని నీకు యున్నదో అదేదయచేయుము. నేను యెల్లప్పుడు నీ సన్నిధిలో స్వేచ్ఛగా సంచరింపగల బిడ్డనుగా నన్ను స్థిరపరచుచుండుము. కష్టకాలములోను, సంగతులు అర్థము కాని కాలములోను నేను నీ పక్షముగా నిలువబడగల ధైర్యము దయచేయుము. నిన్ను గూర్చి నాకు గల మంచి అభిప్రాయమును మారనీయకుము. పాపము నుండియు, పాపఫలితము నుండియు నన్ను కాపాడుచుండుము. ప్రతి పర్యాయము నీ వాక్యము నాకు బోధపరచుచుండుము. నా ఆత్మతో సదా మాట్లాడుచుండుము. మరియు నీ విషయమై కృతజ్ఞతతో కష్టపడి పనిచేయగల సేవకునిగా నన్ను స్థిరపరచుచుండుము. నన్ను పెండ్లికుమార్తె వంశము నుండి విడిపోనీయకుము నీ కిష్టము లేనిదే నేను అడుగతలచినప్పుడు అవి ప్రార్థనా వాలులోనికి రాకుండా తప్పింపుము. మరియు ఒక అంశమును గురించి ప్రార్థింపవలసిన గడియ దాటిపోనీయకుము. నాకు ప్రార్థనావాలు దయచేయుము. సర్వజనులకు నీ వాక్యవార్త అందింపగల బోధకులను పంపుము. వాక్యముపదేశించు ఏర్పాటులన్నిటిని వృద్ధిచేయుము. పాపులకు, బాధితులకు, బీదలకు అన్యాయము పొందుచున్న వారికి తోడైయుండి వారి పక్షమున జరుగవలసిన సత్యకార్యములను వృద్ధి చేయుము. ఈ ప్రార్థన నీ

కుమారుని ముఖము చూచి ఆలకింపుము ॥ఆమెన్॥

2. సమర్పణ : ఓ దేవా! నీవు నాకు యిచ్చినవన్నియు నీకు సమర్పించుచున్నాను. మరియు నా శరీరమును, నా ఆత్మను, నాకు కలిగియున్న సమస్తమును నా జీవితకాలములోని గతకాలమును నేటి కాలమును, రాబోవుచున్న కాలమును నీకు యర్పించుచున్నాను. నీ చిత్తము యేదో అదే నా చిత్తమైయున్నది. నీ చిత్తము యనేకమారులు నాకు యిష్టముగా నుండక పోయినను నేనది యిష్టపడునట్లు సహాయపడగోరుచున్నాము. ఏది నేను చేయలేకపోవుచున్నానో ఆ మంచి కార్యమును, నాకు గాని, నీకుగాని, యిష్టములేనిదేది చేయుచున్నానో ఆ కార్యమును నీకు అప్పగించుచున్నాను. మా బంధువులను, స్నేహితులను, అధికారులను, నేనంటే యిష్టములేని వారిని, శత్రువులను నీకప్పగించుచున్నాము. మమ్మును బాధపెట్టు పురుగులు, జంతువులు, పక్షులు మొదలైనవాటిని నీకు సమర్పించుచున్నాము. అలాగే మాకు బాధాకరముగానున్న దయ్యములను, సాతానును తత్ సంబంధమైన వాటినన్నిటిని నీ వశము చేసికొనుచున్నాము. మేము బాధతెచ్చుకొను వృక్షాదులు శిలలు, నీకు అర్పించుచున్నాము. మాకు హాని కరము కలుగునట్టి పంచభూతములను నీకు అర్పించుచున్నాము. ఈ అర్పణ నీ కుమారుని పరిముఖము చూచి అంగీకరించుము ॥ఆమెన్॥

3. రాకడ ప్రార్థన : ఒక గ్రామములో అందరు కలహములతో నుండిరి. ఒకదినమున తన జ్వరముగానున్న కుమార్తెను చూడవచ్చిన తండ్రి భయంకరమైన కలహముల సంగతి విని తన కుమార్తెను తన యింటికి తీసికొనిపోయెను. ఈ లోకము గత్తరలోకము, వ్యాధుల లోకము, విషపురుగుల లోకము, మరణలోకము, దయ్యాలలోకము, దయ్యాలకు లోబడిన మనుష్యులున్న లోకము కాబట్టి మన తండ్రియైన దేవుడు మనలను యిచ్చటనుండి కూడా మోక్షమందిరమునకు తీసికొని వెళ్ళును. ఆయన శీఘ్రముగా వచ్చును. ఇదే రెండవ రాకడ. తండ్రి కుమార్తెను తీసుకొని



వెళ్ళునపుడు రాను అని చెప్పదు. మనము కూడా మేఘములోనికి రాము అని చెప్పకూడదు. ప్రభువా! తండ్రీ! సిద్ధముగా నున్నాను అని చెప్పవలెను. ఓ ప్రభువా! మేమట్లు చెప్పగల కృప దయచేయుము. ॥ఆమెన్॥

"దైవాత్మ రమ్ము, నా తనువున వ్రాలుము
నా జీవమంతయు నీతో నుండజేరి వసింపుము"

ప్రభువు కృప తోడైయుండునుగాక!

* * *